క్లుప్తంగా

తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

నింద్ర: ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శివప్రసాద్ వర్మ ఆదేశించారు. ఆయన శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. నీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

వేలం పాటతో రూ. 3.88 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

కార్వేటినగరం: మార్కెట్ వేలం పాటలో పంచాయతీకి రూ.3.88 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నాగరత్నమ్మ పేర్కొన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో వారపు సంత, కూరగాయల మార్కెట్, బస్టాండు, జంతువధశాలకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో వారపు సంతకు రూ.2.94 లక్షలు, మార్కెట్‌కు రూ.32 వేలు, బస్టాండుకు రూ.31,500, జంతు వధ శాలకు రూ. 30,500 వచ్చాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సెల్వి, ఏఎస్ఐ మునికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నింద్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి సంధ్యసౌందర్య తెలిపారు. ఆమె శుక్రవారం ఐఆర్ కండ్రిగలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆమె మట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు తప్పని సరిగా టీకాలు వేయించాలన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు టీకాలు వేస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బ్యాంక్ మేనేజర్ కిరణ్

శ్రీరంగరాజపురం: తెలుగు క్యాలెండర్‌ను బంగారుపాళ్యం కమిటీ ఆధ్వర్యంలో 49 కొత్తపల్లి మిట్ట యూనియన్ బ్యాంక్ మేనేజర్ కిరణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్ సామాన్య ప్రజలకు అర్థవంతంగా ఉందన్నారు. కార్యక్రమానికి ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు బాలాజీ, రాంకుమార్ ,ప్రశాంత్, బాబు, సురేష్, శ్రీవత్సవ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నగరి ఎమ్మెల్యే



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా తమ నియోజకవర్గానికి చెందిన పలు సమస్యలను కలెక్టర్‌కు వివరించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

బాబూ.. జాబు ఎక్కడ?

- 20 లక్షల ఉద్యోగాల హామీ నెరవేర్చని కూటమి
- పది నెలలవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం
- నిరుద్యోగ భృతి ఇవ్వని వైనం
- ఊసేలేని జాబ్ క్యాలెండర్
- నిరుద్యోగులను నట్టేట ముంచిన ప్రభుత్వం



ఎస్‌కేఆర్ పురంలో పెయింటింగ్ పనులు చేస్తున్న డిగ్రీ, బీటెక్ అభ్యర్థులు (ఫైల్)

పాలసముద్రం: వారంతా ఉన్నత విద్యావంతులు పది మందికి విద్యాబుద్ధులు చెప్పే మేధావులు అయినా బతుకు తెరువు కోసం అగచాట్లు పడుతున్నారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికారు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొలువు దీరి పది నెలలు అవుతున్నా ఒక్క జాబూ ఇవ్వకుండా నిరుద్యోగులను నట్టేట ముంచింది. బాబు వస్తే జాబు గ్యారంటీ మాట ఎలా ఉన్నా.. రూ 3 వేలు నిరుద్యోగ భృతి కూడా గాలిలో కలిసిపోయింది. దీంతో గత్యంతరం లేక బతుకు తెరువు కోసం ఉన్నత విద్యావంతులు కూలీలుగా మారుతున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయి. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన నిరుద్యోగులు బతుకుపోరు మొదలు పెట్టారు. ఇందులో భాగంగానే బీఈడీ, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగులు ఇళ్లకు పెయింటింగ్, మెకానిక్ షెడ్‌లో కూలీలుగా వెళుతున్నారు. భూములున్న రైతు కుటుంబాలకు చెందిన వారు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అమలుకు నోచుకోకపోవడంతో నిరుద్యోగ యువకులు నిరాశలో కూరుకుపోతున్నారు.

మహా నగరాలకు వలసబాట

గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు వేల మంది పట్టభద్రులు, వెయ్యి మందికిపైగా డీఎడ్, వృత్తి విద్యా కోర్సులు చేసిన వారు ఉన్నారు. ఒక వైపు ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు లేకపోవడం, మరోవైపు నిరుద్యోగ భృతి రాక అవస్థలు పడుతున్నారు. దీంతో కుటుంబంపై ఆధారపడలేక స్థానికంగా పనులు లేకపోవడంతో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ లాంటి మహా నగరాలకు పొట్ట చేత పట్టుకొని వలస బాట పడుతున్నారు. కొందరు కుటుంబం గడవడానికి తప్పని పరిస్థితుల్లో కూలీ పనులకు వెళ్తున్నారు.

పెయింటింగ్ పనులు చేస్తున్నా..



నేను డిగ్రీ పూర్తి చేసి అయిదేళ్లు అయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. తీరా గద్దెనెక్కిన తరవాత నిరుద్యోగ యువతకు పూర్తి అన్యాయం జరిగింది. ప్రస్తుతం పెయింటింగ్ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నా. కనీసం నిరుద్యోగ భృతి అయినా ఇస్తే కుటుంబానికి ఆదరువుగా ఉంటుంది.

–వెంకటేశులు, శ్రీబొమ్మరాజుపురం

నోటిఫికేషన్‌లకు ఎదురుచూసి అలసిపోయా..



డీఎడ్ పూర్తి చేసి రెండేళ్లుగా ప్రైవేటు పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా.కొత్త ప్రభుత్వంలో ఉద్యోగ నోటిఫికేషన్‌ల కోసం ఎదురు చూశా. ప్రభుత్వం కొలువుదీరి 10 నెలలు అవుతున్నా పట్టించుకోవడం లేదు. నిరుద్యోగ భృతి నెలకు రూ 3 వేలు ఇస్తామని చెప్పి ఇంత వరకూ ఆ ఊసే ఎత్తడం లేదు. ఇక ప్రైవేటు ఉద్యోగమే దిక్కని సర్దుకుపోతున్నా.

–ధనంజయరెడ్డి, సీఎం కండ్రిగ

చదువులు చదివినా ఫలితం లేదు



ఉద్యోగం వస్తుందని ఉన్నత చదువులు చదివినా ఫలితం లేదు. డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాలకు రెండేళ్లుగా ఎదురు చూసినా ఫలితం లేదు. పది నెలలుగా ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు ఇవ్వలేదు. చివరికి సున్నం కొట్టే కూలీ పనికి వెళ్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నా.

–అంబేద్కర్ (కుట్టి), వెంగళరాజుకుప్పం, దళితవాడ

నిరుద్యోగ భృతి ఎప్పుడో?



సూపర్ సిక్స్‌లో భాగంగా నిరుద్యోగ భృతి కింద నెలకు రూ. 3 వేలు ఇస్తామన్నారు. ఈ పథకాన్ని ఇప్పటి వరకూ అమలు చేయలేదు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగం లేక ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ భారం పెరుగుతోంది. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి అందించి నిరుద్యోగులను ఆదుకోవాలి. ఉన్నత చదువులు చదివి కూలి పనులు చేయలేకపోతున్నా.

–ప్రసాద్, శ్రీకావేరిరాజుపురం

నిరుద్యోగుల ఉసురు తగులుతుంది..



చంద్రబాబు 2014 ఎన్నికల్లోనూ నిరుద్యోగ భృతి అంటూ మోసం చేశారు. మళ్లీ గత ఎన్నికల్లోనూ ఈ హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారం చేపట్టి పది నెలలు గడిచినా ఇప్పటి వరకూ నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ఇలా మోస పూరిత వాగ్దానాలతో నిరుద్యోగ యువతను మోసం చేయడం సమంజసం కాదు. ప్రభుత్వానికి నిరుద్యోగుల ఉసురు తప్పక తగులుతుంది.

–కృష్ణయ్య, ఏట్టుకూరిపల్లె

10 నెలలుగా నోటిఫికేషన్‌లు లేవు..



జనవరిలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఆర్భాటంగా ప్రకటించారు. ఎన్నికల్లో సైతం హామీలు ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తడం లేదు. నిరుద్యోగ భృతి మరిచి పోయారు. నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసింది.

–బాబు, వీర్లగుడి, దళితవాడ

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

వెదురుకుప్పం: మండలంలోని జక్కిదొన పంచాయతీ నచ్చుకూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం అంకురం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలను పంపిణీ చేసినట్లు సంస్థ ప్రతినిధి జయరామయ్య తెలిపారు. 16 మంది విద్యార్థులకు అభ్యసన సామగ్రిని పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రైస్తవ బోధకుల నిరసన

నగరి: క్రైస్తవ బోధకులు పగడాల ప్రవీణ్ కుమార్ అనుమానాస్పద మృతిపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో క్రైస్తవ బోధకులు శనివారం ఉదయం బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేయనున్నారు. ఈ మేరకు బీఎస్పీ నాయకులు పవర్ రామచంద్రన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం క్రైస్తవులపై నిర్లక్ష్య వైఖరిని విడనాడి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. నిరసనలో నియోజకవర్గంలోని క్రీస్తు సంఘాల్లో బోధకులుగా పనిచేస్తున్న వారందరూ పాల్గొంటారని వెల్లడించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె ఆది ఆంధ్రవాడ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి స్థానిక సర్పంచ్ భారతి శాశ్వత పరిష్కారం చూపారు. 10 ఏళ్లుగా గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు పడేవారు. పంచాయతీ నిధులతో శుక్రవారం రాత్రి బోరు వేశారు. ఈ బోరులో నీరు పుష్కలంగా పడినట్లు సర్పంచ్ తెలిపారు. దీంతో గ్రామంలో నీటి ఎద్దడిని శాశ్వతంగా నివారించినట్లు పేర్కొన్నారు.

రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి



మాజీ మంత్రిని రంజాన్ వేడుకలకు ఆహ్వానిస్తున్న పుత్తూరు ముస్లింలు

నగరి: త్యాగానికి ప్రతీక అయిన రంజాన్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మాజీ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. ఆమె శుక్రవారం మీరాసాహెబ్ పాళెం గ్రామంలో ఎంపీటీసీ ఇమ్రాన్‌ఖాన్‌తో పాటు ముస్లింలు నిర్వహించిన వేడుకలో పాల్గొన్నారు. అనంతరం పుత్తూరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శి మాహిన్, ముస్లింలు ఆమెను రంజాన్ వేడుకలకు ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఆచరించే కఠోర ఉపవాసం దైవ చింతనను, ఆధ్యాత్మికతను, క్రమశిక్షణను పెంపొందిస్తాయన్నారు. అత్యంత పవిత్రమైన రంజాన్‌ను దానధర్మాల పండుగగా అభివర్ణిస్తారని, ఇస్లాం మత బోధనల ప్రకారం జీవితాన్ని సన్మార్గంలో



మీరాసాహెబ్ పాళెంలో ముస్లింలతో మాజీ మంత్రి ఆర్కేరోజా

పెట్టేందుకు శిక్షణ పొందే మాసంగా రంజాన్ ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. అలాంటి రంజాన్ పండుగను అత్యంత వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

నాగలాపురం : ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ, వాటి అనుబంధశాఖల అధికారులు సమావేశమై ఖరీఫ్ సీజన్‌లో పండించే పంటలపై ప్రణాళిక రూపొందించడంతో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం వల్ల భూమికి, రైతులు, వినియోగదారులకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం రైతులకు వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు హనుమాన్ నాయక్, ఎంపీడీఓ బాలాజీ నాయక్, వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్రహ్మణ్యం, ఏఓ సుబ్బారావు, డివిజన్, ఎస్.ఎఫ్.ఏ నీలమ్మ, ఏపీఎం సీతారాం, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

రాయితీతో ఉలవలు పంపిణీ

గంగాధర్ నెల్లూరు: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట విస్తీర్ణం తక్కువ కావడంతో ప్రత్యామ్నాయంగా వ్యవసాయ శాఖ 80శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన ఉలవలను ఎంత వరకు వినియోగించుకున్నారు అనే దానిపై పీలేరు ఏడీఏ రమణారావు, నగిరి ఏడీఏ సౌభాగ్యలక్ష్మి రైతుల వద్ద నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో ఏవో భవాని, ఆర్ఎస్కే సిబ్బంది కుసుమ, సంధ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బట్టీని ధ్వంసం చేస్తున్న ఎస్ఐ

- సారా తయారీ చేస్తున్న వ్యక్తిపై కేసు

పాలసముద్రం: నాటుసారా తయారు చేస్తున్న అర్జున్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. శుక్రవారం మండలంలోని నరసింహపురం భూతలకోన వద్ద సారా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ చిన్న రెడ్డప్ప సిబ్బందితో కలసి నాటుసారా తయారు చేస్తున్న ప్రదేశాన్ని చుట్టు ముట్టారు. సారా తయారు చేస్తున్న అర్జున్‌రెడ్డి పరారయ్యాడు.సారా కాస్తున్న బట్టీని, 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

లో ఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తాం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా సంతపేట సెక్షన్ పరిధిలోని తేనబండలో ఉన్న ధర్మరాజుల గుడి వీధిలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. చవటపల్లెలో మరో 100 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

స్వామిత్ర సర్వేపై అవగాహన కల్పించాలి

గంగాధర నెల్లూరు: స్వామిత్ర సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీపీఓ సుధాకర్‌రావు, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గంగాధర నెల్లూరు మండల పరిధిలోని పాత వెంకటాపురం, గెరిగలపల్లి గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్ర సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సర్వే గ్రామీణ ప్రాంతాల్లోని భూములను సర్వే చేసి ఆస్తి హక్కులను ధ్రువీకరించడానికి చేపట్టిన పథకమని పేర్కొన్నారు. ఈ సర్వే వలన అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రణాళిక కు ఈ సర్వే ఉపయోగపడుతుందని, ఆస్తి పన్నుల వసూలు సులభతరం అవుతుందన్నారు.



గెరిగల పల్లిలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ , ఎంపీడీఓ

కార్యక్రమంలో పాత వెంకటాపురం సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కవి దేశిరాజు చంద్రశేఖర్‌కు సన్మానం

నగరి: నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన శతాధిక జాతీయ ఉగాది సమ్మేళనంలో కవి, నగరి మండలం ముడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు పండితుడు దేశిరాజు చంద్రశేఖర్‌ను సన్మానించారు. విశ్వావసు ఉగాది కవి సమ్మేళనంలో పాల్గొన్న చంద్రశేఖర్ తన కవితాగానంతో అందరినీ మెప్పించారు. దీంతో నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించి నగరి కవిగా ధ్రువీకరణ పత్రంను అందజేశారు.



సత్కారం అందుకుంటున్న కవి చంద్రశేఖర్

ఆయనను ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, ముడిపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రియురాలితో సన్నిహితంగా ఉన్నాడని..!

- హత్యాయత్నం కేసులో ఫీల్డ్ అసిస్టెంట్ అరెస్టు

సత్యవేడు : వాహనంతో ఢీకొట్టి చంపడానికి ప్రయత్నించిన కేసులో సత్యవేడు మండలం కన్నావరం గ్రామానికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ తేరువాయి భాస్కర్(44)ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కథనం.. సత్యవేడు పంచాయతీ ఉలవచేనుకు చెందిన కబడ్డీ క్రీడాకారుడు పవన్ ప్రాక్టీస్ కోసం నాగలాపురం మండలం బీరకుప్పం వెళ్లేవాడు. అతనికి కన్నావరం దళితవాడకు చెందిన యువతితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పవన్ ప్రేమించిన యువతి తల్లితో ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ సన్నిహితంగా ఉండేవాడు. అమ్మాయి విషయం తెలియడంతో పవన్‌ను హెచ్చరించాడు. దీంతో పవన్ తన స్నేహితులైన కబడ్డీ ప్లేయర్లు భరత్ (సత్యవేడు), సారధి(బీరకుప్పం), ఉదయ్(బీరకుప్పం)కు విషయాన్ని చెప్పి భాస్కర్‌ను బెదిరించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో మార్చి 24న పవన్ తన స్నేహితుడైన భరత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బీరకుప్పం వెళ్లాడు. అక్కడ స్నేహితులు సారధి, ఉదయ్‌ని కలిసి భాస్కర్‌ను బెదిరించాలని మాట్లాడుకున్నారు. తర్వాత పవన్, భాస్కర్‌కు ఫోన్ చేసి బెదిరించాడు. అదేరోజు మధ్యాహ్నం తన స్నేహితులు ముగ్గురితో వచ్చి భాస్కర్‌తో గొడవ కుదిగి కొట్టారు. ఇది తట్టుకోలేని ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ ప్రతీకారంగా పవన్‌ను మట్టు పెట్టాలని



సత్యవేడు సర్కిల్ కార్యాలయంలో నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

నిర్ణయించుకున్నాడు. అదేరోజు సాయంత్రం మినీ లగేజ్ వాన్ తీసుకుని సత్యవేడుకు వస్తుండగా మార్గ మధ్యలో పవన్, అతని ముగ్గురు స్నేహితులతో కలసి ఎదురుగా స్కూటీలో నిలిచి ఉండడం గుర్తించాడు. వెంటనే లగేజీ వాన్‌తో వారిని ఢీ కొట్టాడు. నలుగురికీ గాయాలయ్యాయి. గాయపడిన పవన్ సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో భాస్కర్‌పై ఫిర్యాదు చేశాడు. సీఐ మురళీనాయుడు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టారు. వరదయ్యపాళెం ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదిలావుండగా ఇదే కేసుకు సంబంధించి శుక్రవారం బాధితుల కుటుంబాలకు చెందిన వారు సత్యవేడు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. తమ బిడ్డలను చంపాలనుకున్న భాస్కర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పార్కు అధ్వానం... ఆహ్లాదం దూరం



విరిగిన కింపడి ఉన్న వ్యాయామ పరికరం



ఎండిపోయిన గడ్డి

ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలన్న ఉద్దేశంతో వడమాలపేట మండల కార్యాలయానికి కూత వేటు దూరంలో ఏర్పాటుచేసిన పార్కు నిర్వహణను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. కనీసం పార్కులో చెత్తను సైతం శుభ్రం చేయడం లేదు. చెట్లు, గడ్డికి నీరు పట్టకపోవడంతో ఎండిపోతున్నాయి. ఆహ్లాదం కోసం పార్కుకు వచ్చే స్థానికులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. అధికారులు స్పందించి పార్కు నిర్వహణ గురించి పట్టించుకోవాలని కోరుతున్నారు.

- పార్కు నిర్వహణను గాలికొదిలిన అధికారులు
- ఎండిపోతున్న చెట్లు
- వాకింగ్ చేయడానికీ వీలు కావడం లేదంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట వాసులకు ఆహ్లాదాన్ని అందించాలన్న ఉద్దేశంతో గత ఏడాది జనవరి 25వ తేదీన మాజీ మంత్రి ఆర్కే రోజా తుడా నిధులు సుమారు రూ.40 లక్షలతో పార్కు ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఆ పార్కుకు శ్రీ పద్మావతి అమ్మవారి ఉద్యానవనం అని నామకరణం చేశారు. పార్కులో పచ్చని గడ్డితో పాటు వివిధ రకాలు మొక్కలు నాటించారు. వాకింగ్ చేయడానికి అనువుగా ట్రాక్, పిల్లలు ఆడుకోవడానికి వివిధ రకాల వస్తువులు, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయించారు. స్థానిక ప్రజలు ఉదయం, సాయంత్రం పార్కులోకి వచ్చి సేదదీరుతున్నారు. వాకింగ్ చేస్తున్నారు. పిల్లలు ఆడుకుంటూ ఉంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్కు నిర్వహణ గురించి పట్టించుకోలేదు. దీంతో పార్కులోని గడ్డి, చెట్లు ఎండిపోయాయి. వాకింగ్ చేయడానికి కూడా వీలులేకుండా పోయింది.

పట్టించుకోని పాలకులు

ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్కును ఏర్పాటు చేశారు. దాని నిర్వహణను పట్టించుకోకపోవడంతో పార్కు అధ్వానంగా మారింది. వ్యాయామ పరికరాలు అన్నీ విరిగిపోయాయి. పార్కు నిండా చెత్తా చెదారం దర్శనమిస్తోంది. మండల కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ పార్కు ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్కులో కాసేపు సేద తీరేందుకు కూడా అవకాశం లేకుండా అధ్వానంగా మారిందని, ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకుని పార్కును బాగు చేయాలని కోరుతున్నారు.

పార్కుకి వెళ్లడం లేదు

పార్కు ప్రారంభించినప్పుడు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తూ, కాసేపు విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా ఉండేది. నాతో పాటు, పిల్లలు కూడా ఆటలాడుకోవడానికి వచ్చేవారు. ఇప్పుడు ఎక్కడ చూసినా చెత్త పడి ఉండడంతో వాకింగ్ చేయడానికి కూడా వీలు లేకుండా ఉంది. వ్యాయామ పరికరాలు విరిగిపోయాయి. గడ్డి ఎండి పోయింది. పిల్లలు వెళ్లడం మానేశారు.

– వేణు, వడమాలపేట

ఇందిరమ్మ గార్మెంట్ ఏర్పాటు

ఐరాల: మండలంలోని అగరంపల్లె కాలనీలో త్వరలో ఇందిరమ్మ గార్మెంట్ ఏర్పాటు చేయనున్నట్లు హీరో స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఏ.పరదేశి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీ కులాలకు చెందిన నిరుపేదలైన మహిళలు, యువతులకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించి ఆర్థికాభివృద్ధికి సంస్థ అండగా నిలుస్తోందన్నారు. 18 నుంచి 34 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. మూడు నెలల శిక్షణ కాలంలో 50 మంది మహిళలకు అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతినెలా వేతనంతో పాటు మధ్యాహ్నం భోజనం అందిస్తామన్నారు. ఏప్రిల్ 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9014385038, 9985183239 ను సంప్రదించాలని ఆయన కోరారు.

4 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఏప్రిల్ 4 నుంచి 15వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. మార్చి 4న తిరుమంజనం, అంకుర్పాణ, విష్వక్సేన ఉత్సవం, 5న ధ్వజారోహణం, సప్త ఉత్సవం, సింహమాణం, 6న శ్రీరామనవమి, హంసవాహనం, సూర్యప్రభవాహనం, 7న గరుడవాహనం, హనుమంతవాహనం, 8న శేషవాహనం, చంద్రప్రభవాహనం, 9న పల్లకి ఉత్సవం, యాళివాహనం , 10న వేణుగోపాల అలంకరణ, గజవాహనం, 11న రథోత్సవం, తోట ఉత్సవం , 12న పల్లకిలో వెన్న కృష్ణుడి అలంకరణ, గుర్రపు వాహనం ఉంటాయి.